తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
05-08-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 178
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

2



# పాలిటిక్స్ లో షార్ట్ ఫార్ములా

## షార్ట్ వీడియోలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు

- ఇన్‌స్టా చుట్టూ రాజకీయ ప్రచారం..
- జెన్ జీని టార్గెట్ చేస్తున్న నేతలు
- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌పై పార్టీల ప్రత్యేక దృష్టి
- జెన్ జీ ఓటర్ల అభిరుచులకు అనుగుణంగా మారుతున్న రాజకీయ వ్యూహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, (సిరి న్యూస్):**
దేశంలో ఎన్నికల ప్రచార శైలి వేగంగా మారుతోంది. ఒకప్పుడు వార్తాపత్రికల ప్రకటనలు, బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లు ప్రధాన ప్రచార సాధనాలుగా ఉండగా.. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో కీలక వేదికలుగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సీనియర్ నాయకుల నుంచి యువ నేతల వరకు అందరూ డిజిటల్ వేదికల ద్వారా యువ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

**జెన్ జీ ఓటర్లే ప్రధాన లక్ష్యం**
18 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు గల జెన్ జీ ఓటర్ల ఆలోచనా విధానం రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలను ప్రభావితం చేస్తోంది. ఈ తరం ఫేస్‌బుక్ కంటే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలపై ఎక్కువ సమయం

మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



## ప్రతి గింజా ప్రజల ఆస్తే

- డిఫాల్ట్ మిల్లర్ల నుంచి ప్రతి పైసా, ప్రతి గింజా వసూలు
- నిజాయతీ మిల్లర్లకు పూర్తి రక్షణ
- దశాబ్ద కాలపు సీఎంఆర్‌పై ఆడిట్‌కు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్) :**
ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తరువాత తొలిసారిగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై గత పది నుంచి 12 సంవత్సరాల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన ప్రతి లావాదేవీ, మిల్లర్ల వారీగా డిఫాల్ట్‌లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి భవిష్యత్తులో ఎలాంటి లోపాలకు తావు

మిగతా 2వ పేజీలో..

## అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

2





## మసాలాల్లో మహా కల్తీ

- 25 టన్నుల నకిలీ మసాలా స్వాధీనం.. మరో 89 టన్నుల నిల్వలు గుర్తింపు
- కాటేదాన్‌లో హెచ్-ఫాస్ట్ భారీ దాడులు
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులతో మసాలాల తయారీ
- ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయాలు
- 13 వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించిన అధికారులు
- కల్తీ ఆహారంతో తీవ్ర ఆరోగ్య సమస్యల ప్రమాదమని హెచ్చరిక

2

## అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

'బ్రిక్స్' దేశాల మధ్య సహకారం బలోపేతం కావాలి

భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా

ప్రారంభమైన ఏసీడబ్ల్యూజీ సమావేశం

3






## 30 సెకండ్లు.. 30 కత్తిపోట్లు!

- ఫరీదాబాద్‌లో ఉపాధ్యాయురాలి దారుణ హత్య
- ముఖం, మెడపై కత్తితో దారుణంగా పొడిచి చంపిన కిరాతకుడు
- పాఠశాలలో విధి నిర్వహణలో ఉండగానే ఘాతుకం
- ముసుగు వేసుకుని మరీ అత్యంత అమానుషంగా దాడి
- రెండు గంటల్లోనే పోలీసుల అదుపులో నిందితుడు

3

## అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

- డీసీపీ ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు
- రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా
- సీఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



2

## ఇక సర్కారు కార్యాలయాలకు టీఫైబర్ నెట్ సేవలు

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్) :**
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం టీఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. టీఫైబర్ సేవలపై తన కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. గడువులోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సేవలు అందించేలా

మిగతా 2వ పేజీలో..



## సీజేపీ దూకుడు

- నీట్ ఉద్యమం తర్వాత దేశవ్యాప్తంగా రిజిస్టరింగ్ టూర్
- యువతతో నేరుగా మమేకం కావాలని పార్టీ నిర్ణయం
- మహారాష్ట్రలో రెండు రోజుల కీలక సమావేశం
- జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న వాలంటీర్లతో చర్చలు



4



## రాజీనామా చేస్తే వెంటనే ఆమోదం

- కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి.. డీకే శివకుమార్ హెచ్చరిక
- రాజీనామా చేస్తే నిమిషాల్లోనే ఆమోదిస్తానన్న ముఖ్యమంత్రి
- అసంతృప్త ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలుస్తానని స్పష్టీకరణ

4




## ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- నాణ్యతపై ఆందోళన అవసరం లేదు.. కఠిన తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడి
- ఈ20 పెట్రోల్ నాణ్యతపై కేంద్రం వివరణ
- దేశవ్యాప్తంగా 87 వేలకుపైగా బంకుల్లో నిరంతర పరీక్షలు

4

# అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

హైదరాబాద్, ఆగస్ట్ 4, (సిరి న్యూస్):

ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. కిషన్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్2, మణుగూరు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

హైదరాబాద్,ఆగస్ట్ 4 (సిరి న్యూస్):

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్పిటల్స్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టుపెట్టారు. రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఎంసీహెచ్, జిల్లా హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్సీలు మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీష్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో శాఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్) :

పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతోపాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమనిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతోపాటు అన్ని ప్రక్రియలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక సర్కారు కార్యాలయాలకు టీఫైబర్ నెట్ సేవలు

మొదటిపేజీ తరువాయి

ఏర్పాట్లు చేయాలని టీ ఫైబర్ అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 1 తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ నిమిత్తం ఎలాంటి బిల్లులు చెల్లించొద్దని, 'టీస్వాన్'(TSWAN) నెట్‌వర్క్‌ను నెల రోజుల్లోగా టీఫైబర్‌కు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ'కి కూడా పూర్తిస్థాయిలో టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో చేపట్టిన 'ఇంటింటికి ఇంటర్నెట్ ' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు తప ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గింజా ప్రజల ఆస్తే

మొదటిపేజీ తరువాయి

లేకుండా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో గత దశాబ్ద కాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సీఎంఆర్ బకాయిలు, ఎఫ్‌సీఐకి అప్పగించిన బియ్యం, జిల్లాల వారీగా, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్‌ట్‌లు, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం శిక్షలు విధించడం మాత్రమే కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. అధికారులు వివరించిన మేరకు పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తుతం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రతి కేసుపై మిల్లరు వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమట, ప్రజల సొమ్ము**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కింద కొనుగోలు చేసే ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమటతోపాటు ప్రజల సొమ్ము ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగిస్తుందని, వారు ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని గుర్తు చేశారు. మిల్లర్‌కు అప్పగించే ప్రతి బస్తా ధాన్యం ప్రభుత్వ ఆస్తి. అది ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తి. అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది ప్రజలకు నష్టం. ప్రభుత్వానికి రావలసిన ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుంది అని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్రంలోని అత్యధికమంది రైస్ మిల్లర్లు నిజాయతీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, కొద్దిమంది మాత్రమే బియ్యం అప్పగింతలో జాప్యం చేయడం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించడం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు.

**విజిలెన్స్ దాడులు కొనసాగుతాయి**

ప్రభుత్వ ధాన్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదు చేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలు సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్‌ల ధ్రువీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మోసం, ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మక ద్రోహం వంటి నేరాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్‌లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**సీఎంఆర్ వ్యవస్థలో సమూల సంస్కరణలు**

గత డిఫాల్‌ట్‌ల సమీక్షతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సీఎంఆర్ నియంత్రణ ఉత్తర్వులను పూర్తిగా సవరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్‌ట్‌లపై కఠిన శిక్షలు, అమలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలను కొత్త విధానంలో చేర్చనున్నారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించి రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవరోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైతు చెమటతో పండిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేస్తున్నందున ప్రతి గింజకు ప్రభుత్వం కాపలాదారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టడంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

**సాంకేతికతతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ**

భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్‌మెంట్-మిల్లింగ్-ఎఫ్‌సీఐ డేటాబేస్‌ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. డిఫాల్‌ట్‌ల కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బందిపడదని మంత్రి స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. 'ప్రభుత్వంతో నిజాఅతీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదు.. వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు' అని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్ లో 'షార్ట్'ఫార్ములా

మొదటిపేజీ తరువాయి

గడుపుతోంది. దీంతో రాజకీయ సందేశాలను కూడా అదే తరహాలో రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. యువతను చేరుకునేందుకు చిన్న నిడివి వీడియోలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రత్యర్థులపై విమర్శలు వంటి అంశాలను కూడా సంక్షిప్త వీడియోల రూపంలో ప్రజలకు చేరవేస్తున్నారు.

**సెకన్లలోనే సందేశం చేరేలా వ్యూహం**

గంటల తరబడి ప్రసంగాల కంటే 15 నుంచి 30 సెకన్లలోనే బలమైన సందేశాన్ని అందించే కంటెంట్‌కు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సెల్ఫీ వీడియోలు, నేరుగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడే విధానం, యువతకు దగ్గరైన భాషను ఉపయోగించడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేలా వీడియోలను రూపొందించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ప్రచారంలో విజువల్ ప్రజెంటేషన్, భావోద్వేగాలు, సరళమైన సందేశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

**పీఆర్ బృందాల పాత్ర పెరుగుతోంది**

డిజిటల్ ప్రచారం కోసం రాజకీయ నాయకులు ప్రత్యేక ప్రజాసంబంధాల సంస్థలు, సోషల్ మీడియా నిపుణుల సేవలను వినియోగిస్తున్నారు. వీడియోల స్క్రిప్టులు, చిత్రీకరణ, ఎడిటింగ్, ప్రచార వ్యూహాలన్నింటినీ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అయితే జెన్ జీ అభిరుచులు వేగంగా మారుతుండటంతో ప్రతి ప్రచారం విజయవంతం అవుతుందనే హామీ లేదు. అందుకే కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ వ్యూహాలను మార్చుకుంటున్నారు.

**వైరల్ కావడం ఒకటి.. ఓట్లుగా మారడం మరోటి**

సామాజిక మాధ్యమాల్లో లక్షల వ్యూస్, లైక్‌లు రావడం సులభమే అయినప్పటికీ వాటిని ఓట్లుగా మార్చుకోవడం మాత్రం రాజకీయ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. కృత్రిమంగా రూపొందించిన ప్రచారాన్ని యువత త్వరగా గుర్తించి ట్రోల్స్, మీమ్స్ రూపంలో వ్యతిరేక ప్రచారం చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. అందుకే సహజత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తూ డిజిటల్ ప్రచారాన్ని రూపొందించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో మరింత కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకం

హైదరాబాద్, ఆగస్ట్ 4, (సిరి న్యూస్):

సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకమని గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో గవర్నర్' అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమావేశం, నషా ముక్తే యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ క్రాస్ సొసైటీ తదితర అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం, పేర్ల నమోదుపై లోక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యను సమీక్షించారు. యూనివర్సిటీలు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు తమ సేవలను విస్తరించాలని సూచించారు. దేశంలోని మానవ వనరుల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే యువతకు విజ్ఞానంతోపాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజీయూ వీసీతోపాటు పలువురు వీసీలు మొదటి తరం విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, హెచ్ఐవీ నివారణ, రక్తదానం, జీవన నైపుణ్యాల పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రస్తావించారు. దీనిలో భాగంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ఏఎస్ఆర్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వం, పౌర సమాజంతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ లోక్ భవన్ తో సమన్వయంతో ముందుకు సాగాలని వీసీలు నిర్ణయించారు.

# కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్ట్ 4, (సిరి న్యూస్):



ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వర రావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ రాష్ట్ర రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తున్నదని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.

# మసాలాల్లో మహా కల్తీ

హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్):



హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతంలో హెచ్‌ఫాస్ట్ అధికారులు భారీ కల్తీ మసాలా దందాను వెలికితీశారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో నకిలీ మసాలా దినుసులు తయారు చేస్తున్న ముఠాపై నిర్వహించిన దాడుల్లో 25 టన్నుల కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకున్నారు. తయారీకి సిద్ధంగా ఉంచిన మరో 89 టన్నుల ముడి నిల్వలను కూడా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**ప్రమాదకర రసాయనాలతో కల్తీ**

విచారణలో జీలకర్ర, లవంగాలు, షాజీరా, ఆవాలు, మెంతులు, సోంపు, చిన్న ఆవాలు వంటి నిత్యావసర మసాలా దినుసులకు బట్టలకు రంగులు అద్దేందుకు ఉపయోగించే ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు కలుపుతున్నట్లు తేలింది. లవంగాల నుంచి నూనె తీసిన తర్వాత మిగిలే వ్యర్థాలను సేకరించి వాటికి హానికర రసాయనాలు కలిపి మళ్లీ విక్రయానికి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**బ్రాండెడ్ పేర్లతో విక్రయాలు**

కల్తీ చేసిన మసాలాలకు ప్రముఖ బ్రాండ్ల ముద్రలు వేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఈ ప్రాసెసింగ్ కోసం ప్రత్యేక యంత్రాలను ఇండోర్ నుంచి తెప్పించి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తక్కువ ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

**13 సంస్థల్లో సోదాలు**

ఈ దాడుల వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి మసాలాలకు రంగు, మెరుపు తీసుకురావడానికి ఇండస్ట్రియల్ ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్, కొన్ని చోట్ల హెయిర్ కలర్ కూడా ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

**ప్రజలకు హెచ్చరిక**

ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపామని, ఆహార భద్రతా చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హెచ్‌ఫాస్ట్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 202 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు లేదా కల్తీ తయారీ కేంద్రాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్) :**

సుస్థిరమైన, సమ్మిళితమైన అభివృద్ధికి అవినీతి ప్రధాన ఆటంకంగా ఉందని 'బ్రిక్స' అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్(ఏసీడబ్ల్యూజీ) సమావేశం అభిప్రాయపడింది. పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవడానికి, అక్రమ ఆస్తుల రికవరీలో 'బ్రిక్స' దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించింది. రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాలు హైదరాబాద్‌లో మంగళవారం ప్రారంభం కాగా భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి అనే సవాలుకు ఏ దేశమూ మినహాయింపు కాదని, ఏ దేశమూ దీన్ని ఒంటరిగా ఎదుర్కోలేదని స్పష్టం చేశారు. అక్రమ ఆర్థిక మళ్లింపులను నివారించి, ప్రజా వనరులను పరిరక్షించడానికి, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సమష్టిగా, సమన్వయంతో కూడిన, నిరంతర అంతర్జాతీయ సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. సమగ్రత, జవాబుదారీతనం, అంతర్జాతీయ సహకారం, ఆవిష్కరణల బలోపేతం అత్యంత ముఖ్యమైనవిగా మారిన ఈ సమయంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ రెండో సమావేశం జరుగుతోందని రచనా షా తెలిపారు. సీమాంతర అవినీతిని ఎదుర్కోవడంపై తన ఉమ్మడి బాధ్యతను బ్రిక్స్ ఆచరణాత్మక సహకారంగా, స్పష్టమైన ఫలితాలుగా మార్చాలన్నారు. నేరాల నుంచి లబ్ధి పొందే వారికి ఏ దేశమూ ఆశ్రయంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, నేరస్తులు, అక్రమ నిధులు సరిహద్దులు దాటి తరలిపోవడానికి అవకాశం కల్పిస్తున్న లోపాల తొలగింపులో బలమైన సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించేందుకు ఏర్పాటు చేసిన అనధికారిక సహకార బ్రిక్స్ భాండాగారం విషయంలో సాధించిన పురోగతిని స్వాగతించారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల విషయంలో, వారి అప్పగింతకు మద్దతు ఇచ్చేందుకు, బ్రిక్స్ దేశాల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్‌పై జరుగుతున్న చర్చలను, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభించటాన్ని కూడా స్వాగతించారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక టెంప్లేట్, స్థానిక నోడల్ పాయింట్లు, నిపుణుల డైరెక్టరీతో కలిసి చట్టాన్ని అమలు చేసే సంస్థల మధ్య వేగవంతమైన, మరింత ప్రత్యక్షమైన, అత్యంత ప్రభావవంతమైన సహకారాన్ని సులభతరం చేస్తాయన్నారు. నివారణాత్మక అప్రమత్తత, సాంకేతికత ఆధారిత పరిపాలనకు పెద్దపీట వేస్తూ అవినీతి ముప్పును ఎదుర్కొనే పరిష్కారంలో సాంకేతికతే కీలకమని కార్యదర్శి అన్నారు. డిజిటల్ గుర్తింపు, ఎలక్ట్రానిక్ సేవలందించే విధానం, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు వ్యవస్థలు వృథాను తగ్గించగలవని, అధికారుల విచక్షణాధికారాలకు కళ్లెం వేయగలవని, ప్రజా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయగలవని పేర్కొన్నారు. దేశ జాతీయ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ అయిన గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్(జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమాలను సాంకేతికత ఆధారిత సంస్కరణలకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. పన్నుల విధింపు, ఇతర ప్రభుత్వ ప్రక్రియల్లో ముఖ రహిత, కాగిత రహిత విధానాలు, సాంకేతికతతో కూడిన నిఘా, డేటా ఆధారిత పర్యవేక్షణ, బలమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను కూడా ఆమె ప్రస్తావించారు.

**నైతిక పరిపాలనపై సమాంతర కార్యక్రమం**

విస్తరించదగిన విజిలెన్స్ పద్ధతులు, సాంకేతికత ఆధారిత పరిష్కారాలు, నివారణాత్మక పర్యవేక్షణా విధానాలపై సభ్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడానికి ఒక చక్కటి అవకాశాన్ని అందిస్తుందని రచనా షా తెలిపారు. అవినీతికి పాల్పడి పరారైన నేరస్థుల అన్వేషణ, నేరస్థుల అప్పగింతకు మద్దతు ఇచ్చే అనధికారిక సహకారంపై బ్రిక్స్ రిపాజిటరీ, బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ రెండో సెషన్‌లో చర్చలు జరగనున్నాయి. 'నవకల్పనలు, సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పాలన'పై ఒక సమాంతర కార్యక్రమం, 'ఆర్థిక సాంకేతికత(ఫిన్‌టెక్), వర్చువల్ డిజిటల్ అసెట్స్ (వీడీఏలు) నుంచి ఎదురవుతున్న అభివృద్ధి చెందుతున్న ముప్పులు, అవినీతి ద్వారా వచ్చిన సొమ్మును దాచడంలో, లాండరింగ్ చేయడంలో వాటి దుర్వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక సెషన్ ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ప్రారంభోత్సవంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ చైర్మన్ జె.అశోక్ కుమార్ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలికారు. వారి నిరంతర భాగస్వామ్యానికి, నిర్మాణాత్మక సహకారానికి, పరస్పర సహకార స్ఫూర్తికి ధన్యవాదాలు తెలిపారు. గత కొన్ని నెలల్లో సాధించిన పురోగతి, నిరంతర చర్చల విలువ అవినీతి నిరోధక సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ దేశాల మధ్య ఉన్న ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం బలోపేతానికి ఆచరణాత్మక సాధనాలు, విధానాలను అభివృద్ధి చేయడంపై ఏసీడబ్ల్యూజీ దృష్టి సారించిందన్నారు.

# 30 సెకండ్లు.. 30 కత్తిపోట్లు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**





హరియాణాలోని ఫరీదాబాద్ సిక్రోనా గ్రామంలో అత్యంత అమానుషమైన, భయానక ఘటన వెలుగు చూసింది. పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న ఓ యువ ఉపాధ్యాయురాలిని కామాంధుడు అతి కిరాతకంగా కత్తితో పొడిచి హతమార్చిన వైనం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దినచర్యలో భాగంగా సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఆ ఉపాధ్యాయురాలి ప్రాణాలు గాలిలో కలిసిపోవడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరీదాబాద్‌లోని సరస్వతి సీనియర్ సెకండరీ స్కూల్‌లో 29 ఏళ్ల సంధ్య ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం ఆమె సాధారణంగానే పాఠశాలకు రాగా, ఆమెను కలవాలంటూ గేటు వద్దకు ఓ యువకుడు వచ్చాడు. సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంధ్య బయటకు వెళ్లగా, అప్పటికే ముసుగు ధరించి కాచుకుని ఉన్న నిందితుడు ఆమెపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. సీసీటీవీ దృశ్యాల ప్రకారం.. నిందితుడు పాఠశాల లోపలే కొంతసేపు వేచి చూశాడు. సంధ్య రాగానే ఆమెను పట్టుకుని లాగి కత్తితో వరుసగా పొడిచాడు. ముఖం, మెడ, ఛాతి, పొట్ట భాగాల్లో తీవ్ర గాయాలు అయ్యేలా కేవలం అర నిమిషంలో దాదాపు 20 నుంచి 30 సార్లు కత్తితో అతి కిరాతకంగా దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**రెండు గంటల్లోనే అదుపులోకి..**

ఆ అరుపులు విని పాఠశాల నిర్వాహకుడు తేజ్‌పాల్ అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు అతడిపై కూడా కత్తితో దాడికి యత్నించడంతో ఆయన వెనక్కి తగ్గాల్సి వచ్చింది. అనంతరం సంధ్యపై మరోసారి విచక్షణారహితంగా దాడి చేసి, నిందితుడు బైక్‌పై పరారయ్యాడు. ఈ దారుణ ఘటనపై తక్షణమే స్పందించిన పోలీసులు, నిందితుడి కోసం గాలించి కేవలం రెండు గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అమిత్ (21)గా గుర్తించగా, విచారణలో అతడు నేరాన్ని అంగీకరించాడు.

**ప్రతీకారంతోనే దారుణ హత్య..**

ప్రాథమిక దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు అమిత్‌కు సంధ్యతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడిందని, అయితే ఆమె మాట్లాడేందుకు ఎంతమాత్రం ఆసక్తి చూపకపోయినా నిందితుడు నిత్యం వెంటపడుతూ వేధించేవాడని తేలింది. ఈ వేధింపులు మితిమీరిపోవడంతో ఇటీవలే ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, కేసు కూడా నమోదైంది. అయితే ఆ సమయంలో అమిత్ బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో ఆమె కేసును వాపసు తీసుకుంది. ఆ కక్షను మనసులో పెట్టుకునే ప్రతీకారంతో ఈ దారుణ హత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# వరంగల్‌కు మెడికల్ హబ్ హోదా

- **రాష్ట్రంలో రెండో అతిపెద్ద వైద్య కేంద్రంగా అభివృద్ధికి కార్యాచరణ**
- **ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై మంత్రుల సమీక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

వరంగల్‌ను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, వైద్య సేవలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్య సంస్థల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంజీఎం ఆసుపత్రి, సీకేఎం ఆసుపత్రి, కాకతీయ వైద్య కళాశాల, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి తదితర సంస్థల అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, సిబ్బంది భర్తీ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, డయాలసిస్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ సదుపాయాలు, ఆధునిక పరికరాల ఏర్పాటు, అవసరమైన వైద్య సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని మంత్రులు సూచించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎంజీఎం ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, పాత భవనాల మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్, భద్రతా వ్యవస్థల బలోపేతంతో పాటు ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగిస్తాం

- **పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి**
- **విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలుపై ఆలోచన**
- **ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఆన్‌లైన్ ద్వారా చేపల పంపిణీ**
- **రూ.కోటి 34 లక్షల బీమా క్లియర్ చేశాం**
- **పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి**

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్):**



రాష్ట్రంలోని 26 వేల చెరువులు, వంద రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని విస్తరించడంతోపాటు మత్స్యకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, మత్స్యరంగ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం లక్ష్యంగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు బీమా, మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలపై సమీక్షిస్తామని వెల్లడించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతోపాటు మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరిచే దిశగా మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు నెలకొన్న సహకార సంఘాల సభ్యత్వ వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి అవకాశం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారులకు సంబంధించిన రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రొటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.



## 15లోగా 13,046 పంట
# కుంటలు పూర్తి చేయాలి

- **గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

రాష్ట్రవ్యాప్తంగా 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని ఈనెల 15లోగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్‌డీఓలు), జిల్లా పంచాయతీ అధికారులు(డీపీవోలు), జడ్పీ సీఈఓలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీబీజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీఎస్‌ఏపీ) అమలుపై సమీక్షిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో వ్యవసాయ కుంటల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభాన్ని వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 50 ఎకో ఫార్మ్ పాండ్లను సెర్ప్‌ఎన్‌ఆర్ఎల్ఎం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖల సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తెలంగాణ జలసిరి కింద వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, బహిరంగ బావుల అభివృద్ధి వంటి నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ తనిఖీలు నిర్వహిస్తూ మండలస్థాయి అధికారులతో నిరంతరం సమీక్షలు చేపట్టి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే జీపీఎస్‌ఏపీ)మాన్యువల్ తయారీని పూర్తి చేసి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతోపాటు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ఫుడ్ పాయిజన్‌పై టీజీహెచ్‌ఆర్‌సీ
# సుమోటోగా కేసు

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్) :**

ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్‌ఆర్‌సీ) సుమోటోగా కేసు నమోదు చేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం వల్ల 27మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఓ పత్రికలో మంగళవారం వార్త ప్రచురితం కావడంపై చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలోని మానవ హక్కుల కమిషన్ స్వయంచాలకంగా (సుమోటోగా) కేసు నమోదు చేసింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన వైద్య చికిత్స, వసతి గృహంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుధ్యంపై నిర్వహించిన విచారణ ఫలితాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న నివారణ, సరిదిద్దే చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. సెప్టెంబర్ 7వ తేదీలోగా విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది.

# మండల కేంద్రాల్లో ప్రజావాణి

- **ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ**
- **ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం**
- **మండల స్థాయి అధికారులందరికీ తప్పనిసరి హాజరు**
- **స్థానికంగానే సమస్యల పరిష్కారానికి చర్యలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్, ఆగస్టు 4, (సిరి న్యూస్):**



ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను మండల స్థాయిలోనే స్వీకరించి వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి, విద్యాశాఖ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, శిశు అభివృద్ధి అధికారి, సంక్షేమ శాఖ అధికారులు, విద్యుత్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, రహదారులుభవనాలు, అటవీ శాఖలతో పాటు దాదాపు 23 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది.

ఇప్పటివరకు భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక వసతులకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం లభించనుంది. దీంతో ప్రయాణ భారం, సమయం, ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నమోదు విధానం అమలు చేయనున్నారు. నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.



# బీజేపీ ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం పార్టీ, ప్రభుత్వం రెండింటి నిర్ణయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలదే కీలక పాత్ర. కాబట్టి వారు పరిస్థితులను సకాలంలో అంచనా వేయడం అవసరం. ఎందుకంటే దేశంలో పాలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అసంతృప్తి క్రమంగా పెరుగుతోందనే సంకేతాలు ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సూచిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది. మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం గుజరాత్‌లో మాత్రమే విజయాన్ని నమోదు చేయగా, అధికారంలో ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో పరాజయం పాలైంది. సాధారణంగా అధికార పార్టీలకు ఉప ఎన్నికల్లో అనుకూల వాతావరణం ఉంటుందనే రాజకీయ సూత్రానికి భిన్నంగా వచ్చిన ఈ ఫలితాలు ప్రజాభిప్రాయంలో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇక నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విద్యార్థుల నిరసనలు, పార్లమెంట్ ముట్టడి వంటి పరిణామాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని కేవలం రాజకీయ పరిణామంగా కాకుండా, విద్యా వ్యవస్థపై యువతలో పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిబింబంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ప్రారంభంలో ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోని ప్రధాన స్రవంతి మీడియా కూడా చివరకు దాని ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి వచ్చింది. చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, విద్యార్థి ఉద్యమాలను ఏ ప్రభుత్వం తేలికగా తీసుకున్నా దాని రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో జరిగిన ప్రజా ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు యువత పోషించిన పాత్ర కీలకమైనది. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత ఆకాంక్షలు, ఆవేదనలను విస్మరించడం ఏ ప్రభుత్వానికీ శ్రేయస్కరం కాదు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 242 సీట్లకే పరిమితం కావడం కూడా ప్రజలు ఇచ్చిన ఒక హెచ్చరికగానే విశ్లేషించాలి. తాజాగా ఉప ఎన్నికల ఫలితాలు ఆ హెచ్చరికను మరింత బలపరిచినట్లు కనిపిస్తున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పెరుగుతున్న పన్నుల భారం, విద్యా, వైద్య రంగాల్లో సామాన్యులకు పెరుగుతున్న ఆర్థిక భారాలు ప్రజల్లో అసంతృప్తికి కారణాలుగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక ప్రత్యేక రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విజయం కేవలం ఒక నియోజకవర్గ ఫలితం మాత్రమే కాదు, బీజేపీకి బలమైన రాజకీయ హెచ్చరికగా కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానంలో పరాజయం ఎదురుకావడం, ముఖ్యంగా అగ్రవర్ణ ఓటర్ల ప్రాబల్యం ఉన్న నియోజకవర్గంలో ఈ ఫలితం రావడం పార్టీకి ఆలోచన కలిగించే అంశం. నీట్ వివాదం, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలు యువత ఓటింగ్ ధోరణిపై ప్రభావం చూపినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. యువతతో పాటు మధ్యతరగతి, వృద్ధులు కూడా మార్పు కోరుకుంటున్నారనే సంకేతాలు ఈ ఎన్నికల్లో కనిపించాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు బలహీనంగా ఉండొచ్చు కానీ, ప్రతిపక్ష భావజాలం మాత్రం బలంగా ఉందన్న ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్య కూడా ఈ నేపథ్యంలో ప్రస్తావనీయమే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం విజయాలు, పరాజయాలను మాత్రమే సూచించవు. అవి ప్రజల మనోభావాలకు అద్దం పడతాయి. అందువల్ల ఉప ఎన్నికల ఫలితాలు, విద్యార్థి ఉద్యమాలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం సీరియస్‌గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో సంస్కరణలు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, ధరల నియంత్రణ, పన్నుల భారాన్ని తగ్గించడం, సామాన్యులకు అందుబాటులో విద్యా, వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో వేగంగా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయగలుగుతారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, కాలానుగుణంగా విధానాల్లో మార్పులు తీసుకురాగలిగినప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా దీర్ఘకాలికంగా ప్రజల మద్దతును నిలబెట్టుకోగలదనేది ప్రజాస్వామ్య చరిత్ర చెప్పే వాస్తవం.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- నాణ్యతపై ఆందోళన అవసరం లేదు.. కఠిన తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడి
- ఈ20 పెట్రోల్ నాణ్యతపై కేంద్రం వివరణ
- దేశవ్యాప్తంగా 87 వేలకుపైగా బంకుల్లో నిరంతర పరీక్షలు
- నాణ్యత లేని 302 ఇథనాల్ ట్యాంకర్లను తిరస్కరించిన కేంద్రం
- కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఇథనాల్ కొనుగోలు నుంచి బంకుల వరకు బహుళస్థాయి తనిఖీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌పై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ కీలక వివరణ ఇచ్చింది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కారణంగా వాహనాల ఇంజిన్లకు నష్టం జరుగుతోందన్న ప్రచారంపై స్పందించిన కేంద్రం, ఇంధన నాణ్యత విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా కఠినమైన నాణ్యత నియంత్రణ వ్యవస్థ అమల్లో ఉందని వెల్లడించింది.

**నిరంతర నాణ్యత పరీక్షలు**

దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకుపైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు ఇంధనంలో నీటి కలుషితాన్ని పరీక్షిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. క్లోరైడ్, సల్ఫైడ్ వంటి కలుషితాలను గుర్తించేందుకు ఇప్పటివరకు రెండు వేలకుపైగా నమూనాలను పరీక్షించినట్లు పేర్కొంది. దేశంలో కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ కలుషితం గుర్తించగా, ఆయా పెట్రోల్ బంకుల్లో విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు వెల్లడించింది.

**కల్తీకి కఠిన చర్యలు**

ఇంధనంలో కల్తీ లేదా కలుషితానికి పాల్పడినట్లు తేలిన రిటైల్ అవుట్‌లెట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. వాహనదారులకు నాణ్యమైన ఇంధనం అందేలా ప్రతి దశలో పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపింది.

**ఇథనాల్‌కు కఠిన ప్రమాణాలు**

ఈ20 పెట్రోల్ తయారీలో ఉపయోగించే ఇథనాల్ బీఐఎస్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కేంద్రం తెలిపింది. ఇథనాల్‌లో కనీసం 99.6 శాతం స్వచ్ఛత ఉండటం తప్పనిసరి అని పేర్కొంది. డిస్టిలరీల నుంచి పంపే ప్రతి బ్యాచ్‌ను నాణ్యత పరీక్షల అనంతరమే స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది.

**302 ట్యాంకర్లకు నిరాకరణ**

జూలై 2024 నుంచి జూన్ 2026 వరకు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని 302 ఇథనాల్ ట్యాంకర్ ట్రక్కులను తిరస్కరించినట్లు కేంద్రం తెలిపింది. సుమారు 10,500 కిలోలీటర్ల ఇథనాల్‌ను స్వీకరించకుండా వెనక్కి పంపినట్లు వెల్లడించింది. స్వచ్ఛత, నీటి శాతం, సాంద్రత వంటి ప్రమాణాల్లో లోపాలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

**ప్రతి దశలో పర్యవేక్షణ**




ఇథనాల్ కొనుగోలు నుంచి డిపోల్లో నిల్వ, ఈ20 పెట్రోల్ తయారీ, పెట్రోల్ బంకులకు సరఫరా వరకు ప్రతి దశలోనూ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇంధన కలుషితంపై వస్తున్న ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది.

# రాజీనామా చేస్తే వెంటనే ఆమోదం

- కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి.. డీకే శివకుమార్ హెచ్చరిక
- మంత్రివర్గ విస్తరణ తర్వాత కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు
- రాజీనామా చేస్తే నిమిషాల్లోనే ఆమోదిస్తానన్న ముఖ్యమంత్రి
- అసంతృప్త ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలుస్తానని స్పష్టీకరణ
- కరవు ప్రాంతాల పర్యటనకు కొత్త మంత్రులకు ఆదేశాలు
- బోర్డులు, కార్పొరేషన్లలో కొత్త నియామకాలకు సంకేతాలు

**బెంగళూరు, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

కర్ణాటక మంత్రివర్గ విస్తరణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి బహిర్గతమవుతోంది. మంత్రి పదవులు దక్కని పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, కొందరు పార్టీ పదవులకు రాజీనామాలు కూడా సమర్పించారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందిస్తూ, ఎవరైనా రాజీనామా చేస్తే కొన్ని నిమిషాల్లోనే ఆమోదిస్తానని హెచ్చరించారు. అదే సమయంలో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఇటీవల పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే కొత్త మంత్రులు కరవు ప్రభావిత జిల్లాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని డీకే శివకుమార్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి పదవులు దక్కని నేతలు ఓర్పుతో ఉండాలని సీఎం సూచించారు. తన రాజకీయ జీవితంలోనూ అనేకసార్లు మంత్రి పదవి రాకపోయినా పార్టీని వీడకుండా సహనంతో ఎదురుచూశానని గుర్తు చేశారు. రాజకీయ భవిష్యత్తు పార్టీతోనే ముడిపడి ఉంటుందని, భావోద్వేగ నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. మరోవైపు రాష్ట్రంలోని బోర్డులు, కార్పొరేషన్లలో కొత్త నియామకాలు చేపట్టనున్నట్లు డీకే శివకుమార్ వెల్లడించారు. ప్రస్తుతం ఆ పదవుల్లో ఉన్నవారు రాజీనామాలు సమర్పించాలని సూచిస్తూ, ముందుగా పార్టీ కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుంటానని చెప్పారు. మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంపై విజయనగర ఎమ్మెల్యే ఎం. కృష్ణప్పకు మద్దతుగా పలువురు స్థానిక కాంగ్రెస్ పదాధికారులు సామూహిక రాజీనామాలు సమర్పించారు. ఇదే సమయంలో కేఎస్‌ఆర్‌టీసీ చైర్మన్, ఎమ్మెల్యే ఎస్.ఆర్. శ్రీనివాస్ కూడా తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కొందరు నేతలు తమ నిర్ణయాలను మార్చుకున్నారు. మంత్రి పదవి రాకపోవడంతో రాజీనామా చేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే బెలూరు గోపాలకృష్ణ, ముఖ్యమంత్రితో సమావేశమైన తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. పార్టీతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. ఇంకోవైపు మహిళా ఎమ్మెల్యేలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న మహిళా మంత్రి పదవి కోసం పలువురు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. తుమకూరు జిల్లాకు ప్రాతినిధ్యం దక్కలేదని మాజీ మంత్రి కేఎన్ రాజన్న వర్గం కూడా నిరాశ వ్యక్తం చేసింది. మొత్తంగా మంత్రివర్గ విస్తరణ అనంతరం కాంగ్రెస్‌లో చెలరేగిన అసంతృప్తిని చల్లార్చడం డీకే శివకుమార్ నాయకత్వానికి తక్షణ సవాలుగా మారింది. అసంతృప్త నేతలను సమన్వయం చేస్తూ పార్టీ ఐక్యతను కాపాడేందుకు అధిష్ఠానం చర్యలు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

# వ్యాన్‌లోనే అరగంట బైఠాయించిన ఉదయనిధి

- పోలీసుల తీరుపై అభ్యంతరం.. చెంగిపట్టి స్టేషన్‌లో హైడ్రామా
- కేసు నమోదైన స్టేషన్‌కు కాకుండా మరో స్టేషన్‌కు తరలింపు
- వ్యాన్ దిగేందుకు తొలుత నిరాకరించిన ఉదయనిధి స్టాలిన్
- శాంతిభద్రతల కారణంగా మార్పు చేశామని పోలీసుల వివరణ
- చివరకు విచారణకు సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి
- తంజావూరు ఘటనతో తమిళనాడులో రాజకీయ దుమారం

**చెన్నై, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సంబంధించిన కేసు విచారణలో మంగళవారం ఉత్కంఠభరిత పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేసు నమోదు చేసిన తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా, చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఉదయనిధి అభ్యంతరం వ్యక్తం చేశారు. తనపై కేసు నమోదైన స్టేషన్‌కే తీసుకెళ్తేనే దిగుతానని స్పష్టం చేస్తూ సుమారు అరగంటపాటు పోలీస్ వ్యాన్‌లోనే కూర్చున్నారు.

**శాంతిభద్రతల కారణంగానే మార్పు**

తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్ వద్ద డీఎంకే, టీవీకే నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని పోలీసులు భావించారు. అందుకే ముందు జాగ్రత్త చర్యగా చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు వివరించారు. ఈ నిర్ణయాన్ని





ఉదయనిధికి పలుమార్లు వివరించినప్పటికీ, ఆయన తొలుత అంగీకరించలేదు.

**పోలీసులతో చర్చల తర్వాత విచారణకు హాజరు**

పోలీసులు పరిస్థితిని వివరించి నచ్చజెప్పడంతో ఉదయనిధి చివరకు వ్యాన్ నుంచి దిగారు. అనంతరం అక్కడ వేచి ఉన్న పార్టీ కార్యకర్తలకు అభివాదం చేసి చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి విచారణకు హాజరయ్యారు. ఈ ఘటనతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విచారణ**

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై నమోదైన కేసులో మద్రాస్ హైకోర్టు ఆయనకు స్టేషన్ బెయిల్ ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. అదే సమయంలో విచారణకు పూర్తిగా సహకరించాలని కూడా సూచించింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు విచారణ చేపట్టగా, స్టేషన్ మార్పు అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

**రాజకీయంగా వేడెక్కిన వివాదం**

ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. డీఎంకే అధినేత స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండగా, ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయాల్లో మరింత వేడి పుట్టిస్తోంది.

# సీజేపీ దూకుడు

- నీట్ ఉద్యమం తర్వాత దేశవ్యాప్తంగా లిజనింగ్ టూర్
- యువతతో నేరుగా మమేకం కావాలని పార్టీ నిర్ణయం
- మహారాష్ట్రలో రెండు రోజుల కీలక సమావేశం
- జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న వాలంటీర్లతో చర్చలు
- నీట్ ఉద్యమం తర్వాత సంస్థాగత విస్తరణపై దృష్టి
- దేశవ్యాప్త పర్యటన షెడ్యూల్ త్వరలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన ఆందోళనలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. నీట్ ఉద్యమంతో వచ్చిన ఊపును కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా యువతతో నేరుగా మమేకం కావడానికి 'లిజనింగ్ టూర్' చేపట్టనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ పర్యటన ద్వారా యువత అభిప్రాయాలు, ఆశలు, సమస్యలను తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించింది.

**మహారాష్ట్రలో కీలక సమావేశం**

పార్టీ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేసేందుకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో బుధ, గురువారాల్లో రెండు రోజుల సమావేశం నిర్వహించనున్నట్లు సీజేపీ వెల్లడించింది. ఈ సమావేశానికి పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అధికార ప్రతినిధులు, సంస్థాగత నాయకులు హాజరుకానున్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నీట్ వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సుమారు 50 మంది వాలంటీర్లతో పాటు పలువురు భాగస్వాములతో చర్చించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

**నీట్ ఉద్యమాన్ని విజయంగా అభివర్ణించిన పార్టీ**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ



మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, రెండు నెలలపాటు సాగిన ఆందోళన విజయవంతమైందని సీజేపీ పేర్కొంది. ఈ ఉద్యమం యువతలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, యువశక్తి ఏకమైతే ప్రభుత్వాలను కూడా నిర్ణయాలు మార్చే స్థాయికి తీసుకెళ్లగలదని పార్టీ అభిప్రాయపడింది.

**యువతతో ప్రత్యక్ష అనుసంధానమే లక్ష్యం**

యువత అంచనాలను అర్థవంతమైన కార్యాచరణగా మార్చేందుకు పార్టీ కృషి చేస్తోందని సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. దేశవ్యాప్త లిజనింగ్ టూర్ షెడ్యూల్, నిర్వహణ విధానం తదితర వివరాలను త్వరలో ప్రకటిస్తామని పార్టీ వెల్లడించింది. నీట్ ఉద్యమంతో ఏర్పడిన మద్దతును కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా సంస్థాగతంగా మరింత విస్తరించడంలో ఈ పర్యటన కీలకంగా మారుతుందని సీజేపీ భావిస్తోంది.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేసిన ఆదర్శ్ రెడ్డి..



**రామచంద్రపురం, ఆగస్టు 4 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సునీత కుమారుడు సాయినాథ్ నాయక్ అరుదైన వ్యాధితో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సాయినాథ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. సాయినాథ్ నాయక్ చికిత్స కోసం ఆర్థిక సహాయం అందజేసి, బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. సాయినాథ్ నాయక్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాణి యాదవ్, అరుణ జ్యోతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అధ్వానంగా మారిన రహదారులు

### డిప్యూటీ కమిషనర్ కు సిపిఎం వినతి



**అమీన్పూర్ ఆగస్టు 04 సిరి న్యూస్**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్లో గల భ్రమరాంబిక నగర్ కాలనీలో అధ్వానంగా మారిన రహదారుల వల్ల నిత్యం వాహనదారులు బాటసారులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను సిపిఎం నాయకులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతల మయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రాత్రి వేళల్లో ప్రయాణం మరి నరకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు తాత్కాలికంగా గుంతలు పూడ్చడమే కాకుండా శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన సీసీ లేదా తారు రోడ్లను పునర్నిర్మాణం చేయాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహారెడ్డి శ్రీనివాస్ రెడ్డి వీరస్వామి జిలాని అంజిరెడ్డి కిషోర్ కుమార్ రమణయ్య రాఘవేందర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గౌండ్ల కులస్థుల బోనాల ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు





**సంగారెడ్డి, ఆగస్టు 4 (సిరి న్యూస్):**


సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో గౌండ్ల కులస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. ఈ పవిత్ర వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ముందుగా సదాశివపేట పట్టణంలోని ప్రసిద్ధ దుర్గమ్మ గుడిని నిర్మలా జగ్గారెడ్డి సందర్శించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌండ్ల కులస్థులు ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్ నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సదాశివపేట పర్యటన అనంతరం సంగారెడ్డి పట్టణంలో జరిగిన గౌండ్ల కులస్థుల బోనాల వేడుకలకు నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన భారీ బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, గొర్రె పొట్టేళ్లతో అలంకరించిన ఫలహారం బండి ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ జోగిని అవికా బోనం ఎత్తుకుని ఈ వేడుకల్లో ప్రత్యేకంగా పాల్గొనడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గౌండ్ల సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ చక్రవర్తి గౌడ్, సురేందర్ గౌడ్, నక్క నాగరాజు గౌడ్, ఆర్. సుధాకర్ గౌడ్, దుర్గా గౌడ్, భరత్ గౌడ్, ఫని, కిరణ్, శ్రీకాంత్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# నిరుపేదల కు వరం సీ ఎం ఆర్ ఎఫ్

- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**పెద్ద శంకరం పేట, ఆగస్టు 4, (సిరి న్యూస్):**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఊరట నివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళ వారం నాడు పెద్ద శంకరం పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళ వారం నాడు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజ కవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఎంపికైన 63 మంది లబ్ధిదారులకు స్థానిక శాసన సభ్యులు పీ సంజీవ రెడ్డి చెక్కులను అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ ఎం ఆర్ ఎఫ్): ఆపదలో ఉన్న 23 మందికి వైద్య, ఇతర అత్యవసర సహాయం కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ లబ్ధి చేకూరుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన సర్పంచ్ లు, ఉప సర్పంచ్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అన్నాసాగర్ దర్గా ఉపపీఠాధిపతిగా మహ్మద్ హుస్సేన్ ఖాద్రి

### ఈనెల 15వ తేది నుంచి ఉర్సు ఉత్సవాలు

**జోగిపేట,ఆగస్టు 04, (సిరి న్యూస్)**





సంగారెడ్డి జిల్లా అందోలు మండలం అన్నా సాగర్ శివారులో గల దర్గా పీఠాధిపతి హజ్రత్ సోఫీ షాహి మహమ్మద్ ఖలీల్ హుస్సేన్ శుత్తరి ఉల్ ఖాద్రి వయస్సు పైబడి అనారోగ్యం కారణంగా గత 20 సంవత్సరాల క్రితం ప్రకటించిన విధంగా మహమ్మద్ హుస్సేన్ ఖాద్రి ఉప పీఠాధిపతిగా కొనసాగేందుకు బీజాపూర్ ఆశం పీర్ దస్తగిరి పీఠాధిపతి సయ్యద్ ముదుజ హష్మీ, నిర్మల్ సూఫీ నగర్ పీఠాధిపతి సువిషా మహమ్మద్ జాకీర్ హుస్సేన్ లు దర్గా భక్తులతో సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దర్గా ద్వారా ఇదివరకు ఎలాంటి సేవలు అందుతాయో ఆ సేవలను నిస్వార్ధంగా చేపట్టేందుకు ముందుంటానని మహమ్మద్ హుస్సేన్ ఖాద్రి స్పష్టం చేశారు. ఈనెల 15 నుంచి 17 వరకు జరిగే 76వ ఉర్షే షరీఫ్ ఉత్సవాలను ప్రతి ఒక్కరం సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆయన భక్తులకు సూచించారు. అందరూ కలిసి పెద్ద పీఠాధిపతిని ఉత్సవాలకు పిలిచి ఆయన సమక్షంలో నిర్వహిస్తే మరింత బాగుంటుందని పలువురు దర్గా సభ్యులు సూచించారు. ఈ విషయంలో ఖచ్చితంగా పెద్ద పీఠాధిపతి సమక్షంలో ఉత్సవాలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టండి

- అధికారులకు ఎం ఎల్ ఏ ఆదేశాలు
- పెద్ద శంకరంపేట మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**పెద్ద శంకరం పేట, ఆగస్టు 4 (సిరి న్యూస్):**



గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణఖేడ్ ఎం ఎల్ ఏ పి సంజీవ రెడ్డి అన్నారు. మంగళ వారం

పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గ్రామానికి సంబంధించిన సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులపై ప్రజా ప్రతినిధులు తెచ్చిన విన్నపాలను ఆయన నిశితంగా పరిశీలించారు.

**అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

గ్రామాల్లో ఏ విధమైన సమస్యలు ఉన్నా వాటిని ఉపేక్షించవద్దన్నారు. ప్రతి గ్రామం లోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. స్థానిక సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓ, తహసీల్దార్, గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి





- వై జంక్షన్ ను వెంటనే మూసివేయాలి
- బిజెపి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్..

**రామాయంపేట, ఆగస్టు 4 (సిరి న్యూస్)**

రామాయంపేట 44వ జాతీయ రహదారి బైపాస్‌లోని వై జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జాతీయ రహదారుల అధికారులు ప్రమాదాల నివారణ కోసం వై జంక్షన్‌ను మూసివేశారని గుర్తు చేశారు. అయితే కొందరు మట్టి మాఫియా స్వార్ధ ప్రయోజనాల కోసం ఆ మార్గాన్ని తిరిగి తెరవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. రామాయంపేట ప్రజల భద్రత దృష్ట్యా వై జంక్షన్‌ను వెంటనే మూసివేసి, మెదక్ రోడ్డువైపు నుంచి పట్టణంలోకి వాహనాలను మళ్లించేలా ప్రత్యామ్నాయ ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని కోరారు. రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు గతంలో నిర్మించిన అండర్‌పాస్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఎంపీ ఎం. రఘునందన్ రావు సహకారంతో రూ.47 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వై జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. అప్పటి వరకు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాత్కాలిక భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్ గౌడ్, బీజేపీ నాయకులు వెనుముల సిద్ధిరాములు,పబ్బ సత్యం గుప్తా,భానుచందర్ బిజెపి మండల ఉపాధ్యక్షులు వడ్ల శ్యామ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సంగయ్య, నరేష్ అశోక్,అరవింద్,కాసుల స్వామి పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**పటాన్ చెరు, ఆగస్టు 4, (సిరి న్యూస్)**

రుద్రారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పటాన్ చెరు పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 35 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతుడు తన దుస్తులను చెరువు కట్టపై వదిలి వేసి చెరువు లోకి దిగి మునిగి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనపై పటాన్ చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు, అతని కుటుంబ సభ్యులు, లేదా బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు



# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు ప్రారంభం





**రామాయంపేట, ఆగష్టు 4 (సిరి న్యూస్)**

రామాయంపేట 44వ జాతీయ రహదారి బైపాస్‌లోని వై జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం రామాయంపేట సీఐ సైదా సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యామ్నాయ ట్రాఫిక్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వై జంక్షన్ వద్ద ప్రమాదాలు తగ్గించేందుకు రామాయంపేట పట్టణంలోకి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే రైతులు తమ పంట పొలాలకు సురక్షితంగా చేరుకునేందుకు గతంలో నిర్మించిన అండర్‌పాస్‌ను వినియోగించేలా మార్గం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పాఠశాల విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని సీఐ సైదా స్పష్టం చేశారు. ఆటోలు, పాఠశాల వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులు లేదా ప్రయాణికులను తరలిస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వై జంక్షన్‌లో చేపడుతున్న ఈ చర్యలతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులు, విద్యార్థులు, రైతుల రాకపోకలు మరింత సురక్షితంగా మారుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రామాయంపేటలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలు..





- **అమ్మవారి కళ్యాణ మహోత్సవం**

**రామాయంపేట,ఆగష్టు 4 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని 3వ వార్డు రైతు బజార్ సమీపంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం బోనాల మహోత్సవం, అమ్మవారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని ఆమె ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుగులోతు రవి, దేవుని రంజిత్, శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ చింతల యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల స్వామి, మట్టి యాదగిరి, సుకుమార్, సుంకోజు దామోదర్, సుందర్ సింగ్, మోబిన్, మధునాల స్వామి గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, భాను ప్రసాద్, దేవుని నరేష్, నరేందర్, సాయి తేజ, సుధీర్ గౌడ్, సోహెల్, గణేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్–108 సమన్వయ సమావేశం..





**ఎదురవుతున్న సమస్యలపై చర్చ.**

**రామాయంపేట, ఆగష్టు 4 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి ఆధ్వర్యంలో పోలీసు శాఖ, 108 అంబులెన్స్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యంగా గుర్తుతెలియని అపస్మారక స్థితిలో ఉన్న బాధితులకు సకాలంలో చికిత్స అందించి ఉన్నత ఆస్పత్రులకు తరలించే సమయంలో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింబాద్రి మాట్లాడుతూ, ఇలాంటి కేసుల్లో ఎదురయ్యే ఇబ్బందులను రామాయంపేట ఎస్ఐ బాలరాజుకు వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ బాలరాజు మాట్లాడుతూ గుర్తుతెలియని బాధితుల కేసుల్లో పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచి బాధితులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు అజయ్, శ్రీముఖి, మెదక్ జిల్లా 108 కోఆర్డినేటర్ కిరణ్, హెడ్ నర్సులు, నర్సింగ్ సిబ్బంది, 108 సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడుదాం..!





- **పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.**
- **జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్.**

**మెదక్ ఆగష్టు,04(సిరి న్యూస్)**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం హవేలీఘనాపూర్ మండలం పోచారం అభయారణ్యాన్ని సందర్శించి, పోచారం డ్యామ్ లోని వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని , ప్రకృతిని కాపాడినపుడే మానవ జీవితానికి ఒక సార్థకతః ఉంటుందని అన్నారు. జీవ వైవిధ్యం మానవ మనుగడకు జీవం అన్నారు. అనంతరం పోచారం డ్యామ్ వరద ఉధృతిని పరిశీలించి ,అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ సింధు రేణుక, ఆర్ఐ సిద్దు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన మహమ్మద్ రఫీ



**వెల్దుర్తి /ఆగస్ట్ 04, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల మండల పరిదిలోని బస్వాపూర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి చేగుంట మండల ఉప సర్పంచ్ ల పోరం అధ్యక్షులు, చేగుంట ఉప సర్పంచ్ మైనారిటీ నాయకులు మహమ్మద్ రఫీ 50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గుడి పూజారి బసవన్న, దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ గౌడ్, కమిటీ సభ్యులు సుదర్శన్, సత్తయ్య, లచ్చయ్య, రాములు, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పంద్రాగస్టు వేడుకలు

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరు , ఆగస్టు 4, (సిరి న్యూస్):**

రానున్న స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని.. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో అంగరంగ వైభవంగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో వేడుకలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే సంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ఐదు వేల రూపాయల నగదు బహుమతి తో పాటు, ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు 20 వేలు, 15 వేలు, 10 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర ఘట్టాలను, సంస్కృతిని మరిపించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

## జోగిపేటలో ఘనంగా బోనాల ఊరేగింపు



**జోగిపేట, ఆగస్టు 04, (సిరి న్యూస్ ):**

జోగిపేట పట్టణంలో ఆషాడమాసం సందర్బంగా బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువార్డుల్లో ఈ ఉత్సవాలను భక్తి శ్రద్దలతో చేపట్టారు. స్థానిక పోచమ్మ దేవాలయంలో ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసారు. తూర్పుగౌని ముదిరాజ్ సంఘంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. మహాంకాళి మాత విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, కౌన్సిలర్ మెఘావత్, ముదిరాజ్ సంఘం నాయకులు పాండురంగం,వెంకటేశం, సాయిబాబ, ధర్మేందర్, ఉపేందర్‌లతో పాటు పలువురు పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఊరేగింపు ముదిరాజ్ సంఘ భవనం వద్ద నుంచి గౌని చౌరస్తా మీదుగా పోచమ్మ దేవాలయం వరకు సాగింది.

## గడ్డపోతారం మున్సిపాలిటీ లో పట్టభద్రుల ఎం ఎల్ సి చిన్నమైల్ అంజిరెడ్డి పర్యటన

**పటాన్ చెరు, ఆగస్టు 4 (తెలంగాణ వాణి):**



మున్సిపాలిటీ లోని వావిలాల గ్రామం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2 తరగతి గదులు నిర్మించిన మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ వారు నిర్మించిన గదుల ప్రారంభోత్సవానికి స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో గడ్డ పోతారం మున్సిపాలిటీ కన్వీనర్, అధ్యక్షులు మద్దూరి రాజు తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు, నలగండ్ల అశోక్ కుమార్, ఎ. బాను కిరణ్, వడ్ల సత్యనారాయణ, వి. వేణుయాదవ్, వై. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# వెల్దుర్తి ప్రజల న్యాయమైన డిమాండ్‌కు మద్దతుగా వెల్దుర్తి మండల కేంద్రంలో విజయవంతమైన బంద్.

వెల్దుర్తి,ఆగస్టు 04, (సిరి న్యూస్ )



వెల్దుర్తి మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వేరే గ్రామానికి తరలించే ప్రయత్నాన్ని నిరసిస్తూ మంగళవారం వెల్దుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతం చేశారు. ఈ బంద్‌కు వ్యాపారులు, విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు, మరియు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు.. వెల్దుర్తి వ్యాపార వర్తక సంఘాల అధ్యక్షుడు కొమిరి శెట్టి రమేష్ గుప్త ఆధ్వర్యంలో దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి ధర్నాలో భాగస్వాములై అంబేద్కర్ చౌరస్తా వద్ద శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సుమారు ₹33 కోట్ల వ్యయంతో మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయడం ప్రజల న్యాయమైన, సముచితమైన డిమాండ్ అని వ్యాపార వర్తక సంఘం అధ్యక్షుడు రమేష్ గుప్తా అన్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులకు సమానంగా విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. రవాణా, పరిపాలనా సౌకర్యాలు, ప్రజలకు చేరువ వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని వెల్దుర్తి ప్రజలు కోరుతున్నారు.. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రముఖులు, గ్రామస్తులు ఏకమై ఆందోళన చేపట్టారు. మండల కేంద్రానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను అదే ప్రాంతంలో నిర్మించాలని అధికారులు ప్రజల మనోభావాలను గౌరవించి తమ నిర్ణయాలను మార్చుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి కేటాయించిన పాఠశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర ప్రాంతానికి తరలించకుండా చర్యలు తీసుకోవాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్ని పార్టీల నాయకులు గ్రామ యువకులు గ్రామస్తులు హెచ్చరించారు. ఇది రాజకీయాలకు అతీతమైన ప్రజా ప్రయోజన అంశం. వెల్దుర్తి మండల భవిష్యత్తు, విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాల కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి, మంజూరైన తెలంగాణ మోడల్ స్కూల్‌ను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రజల తరఫున మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము.అని వారు తెలిపారు. "విద్య మా హక్కు – వెల్దుర్తి మా హక్కు – తెలంగాణ పబ్లిక్ స్కూల్ మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలి" అనే ప్రజల డిమాండ్ ను ప్రభుత్వం వినాలని ఆశిస్తున్నాము. అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఉపసర్పంచ్ కరే వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి,శేఖర్ గౌడ్, చందు, మహేందర్, పాంబండ శేఖర్, కిచ్చు గారి శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, నవీన్ పటేల్, వాడు సభ్యులు దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



## పుత్రశోకంలో కుటుంబానికి కాంగ్రెస్ అండ

- పుత్రశోకంలో కుటుంబానికి కాంగ్రెస్ అండ..
- నిత్యావసరాలతో బాధితులకు భరోసా..
- మంద తిరుమల్ రెడ్డి ఆదేశాలతో సాయం..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 04 (సిరి న్యూస్)

రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు పుత్రశోకంలో కుంగిపోయిన కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మందమర్రి మార్కెట్‌లోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నివసించే సుర శారద ప్రథమ కుమారుడు సుర వంశీ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోగా, వారి పరిస్థితిని తెలుసుకున్న మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి స్పందించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని యువజన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ నాయకులు సుర శారద కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ప్రజలకు అవసరమైన సమయంలో తోడుగా నిలవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మాజీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వడ్లూరి సునీల్, సామాజిక మాధ్యమాల బాధ్యుడు మూదారపు శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, మహ్మద్ జావీద్ ఖాన్, ప్రదీప్, రిత్విక్, పచ్చిక మహేందర్, సతీష్, మహేందర్, భరత్, రహీం, వెంకటేశ్, కిరణ్ పాల్గొని బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పట్టాల సమస్యపై రైతుల పోరాటం.!..

- రైతుల సమస్యలపై సబ్ కలెక్టర్ కు వినతి..
- పట్టాలు లేక ఎరువులు, పంటల విక్రయాల్లో ఇబ్బందులు..
- సాగు పంటల నమోదు, ఎరువులపై తక్షణ చర్యలు..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 04 (సిరి న్యూస్)

బుచ్చయ్యపల్లి, ఆకనపల్లి గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బుచ్చయ్యపల్లి గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వర్ కోరారు. రైతులకు పట్టాలు లేకపోవడంతో ఎరువుల కొనుగోలు, పంటల విక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు రైతుల తరఫున వినతిపత్రం అందజేశారు. గడ్డం వినోద్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్‌ను కలిసిన జాడి మహేశ్వర్, బుచ్చయ్యపల్లి, ఆకనపల్లి గ్రామాల్లో గోన వెంకట ముత్యాలరావుకు సంబంధించిన భూములు, పట్టా భూముల సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పట్టాలు లేకపోవడంతో యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లేకపోవడంతో పాటు, పండించిన వరి, పత్తి పంటలను విక్రయించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరగా, సబ్ కలెక్టర్ మనోజ్ జిల్లా వ్యవసాయ అధికారితో మాట్లాడి రైతులు సాగు చేసే ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువుల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో రైతులు కర్ణాటక ఓదెలు, బుడిమే ఓదెలు, బండి మల్లేష్, సాగర్ల శీను, శివకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

## రామగుండం కార్మికుల కోసం ఢిల్లీలో ఎంపీ వంశీకృష్ణ గళం..

- ఎన్టీపీసీ సీఎండీతో ఎంపీ వంశీకృష్ణ కీలక భేటీ..
- రామగుండం కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్.
- స్థానిక యువతకు ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 04 (సిరి న్యూస్)



రామగుండం పారిశ్రామిక ప్రాంత కార్మికుల హక్కులు, స్థానిక యువత ఉపాధి కోసం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గట్టిగా స్పందించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ అవకాశాల పెంపు లక్ష్యంగా న్యూఢిల్లీలో ఎన్టీపీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గుర్దీప్ సింగ్‌తో కీలక భేటీ నిర్వహించి పలు డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు గ్రేడ్–బి గుర్తింపు కల్పించి సముచిత వేతనాలు, సంక్షేమ సదుపాయాలు అందించాలని ఎంపీ కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య అర్హత ధ్రువీకరణ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారానే ధ్రువీకరణలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్టీపీసీలో నిర్మాణంలో ఉన్న 800 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్ల సూపర్ థర్మల్ విస్తరణ ప్రాజెక్టులో స్థానిక యువతకు పెద్దపీట వేయాలని, రామగుండం ప్రాంత నిరుద్యోగులకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, స్థానిక యువత భవిష్యత్‌పై ఎంపీ చేసిన ఈ ప్రయత్నం రామగుండం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్టీపీసీ యాజమాన్యం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కార్మిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# బాధిత కుటుంబాలకు టీ యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న పరామర్శ





- దివంగత చినపంగి లచ్చయ్య, పందుల నాగమ్మ సేవలను స్మరించిన నాయకుడు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 04, (సిరి న్యూస్

పెన్ పహాడ్ మండలంలోని చీదేళ్ళ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ దివంగత చినపంగి లచ్చయ్య కుటుంబ సభ్యులను టీ యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న పరామర్శించారు. లచ్చయ్య సతీమణి రాములమ్మతో పాటు కుమారులు జూనియర్ లైన్‌మన్ చినపంగి తిరుపయ్య, గోపి, సైదులు తదితర కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇదే గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పందుల లింగయ్య సతీమణి దివంగత శ్రీ .శే. పందుల నాగమ్మ మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. వారి కుమారులు పందుల వెంకటేశ్వర్లు, పందుల నాగరాజు తదితరులను కలిసి ఓదార్పు తెలిపారు. ఈ సందర్భంగా దివంగత చినపంగి లచ్చయ్య, నాగమ్మ సమాజానికి అందించిన సేవలను లచ్చిమల్ల వెంకన్న కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాయంపేటలో రహదారి ప్రమాదాల నివారణకు

# శాశ్వత చర్యలు చేపట్టాలి – బీజేపీ

- 30 మంది ప్రాణాలు కోల్పోయినా అధికారులకు పట్టదా?
- ప్రాణాలు తీస్తున్న వై జంక్షన్ ను ఎందుకు మూసేయరు?
- బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.

మెదక్, ఆగష్టు 4 (అవని ప్రతినిధి)



రామాయంపేట పట్టణ కేంద్రంలో ఇటీవల మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని,ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజలందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తెలిపారు. రామాయంపేట బైపాస్‌లోని ప్రమాదకరమైన వై జంక్షన్ కారణంగా గతంలో కూడా సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టకపోవడం వల్ల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందువల్ల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెంటనే ప్రమాదకరమైన వై జంక్షన్‌ను మూసివేసి, శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల రోడ్డు ప్రమాదంపై మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ప్రత్యేక చొరవ తీసుకొని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎన్‌హెచ్–44 మేనేజర్ రంగారావు, జీఎంఆర్ మేనేజర్ రాజేందర్, స్థానిక సీఐ బాదావత్ సైదా నాయక్‌తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శాశ్వత ప్రమాద నివారణ చర్యలపై చర్చించారు. అవసరమైన పనులు పూర్తి చేయడానికి సుమారు 15 రోజుల సమయం అవసరమని అధికారులు తెలిపారు. ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా ఎంపీ రఘునందన్ రావు తీసుకున్న చొరవను స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు అభినందించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం పాఠశాల ప్రారంభ, ముగింపు వేళల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి, విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితిని నివారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారతీయ జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నమైన శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు మస్కూరి బాలరాజు, బక్కయ్యగారి యాదగిరి, కౌన్సిలర్ శంకర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ తోనే సామాజిక న్యాయం






- **టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ బట్టి అజయ్.**
- **సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ.**

**మెదక్ ఆగస్టు,04 (సిరి న్యూస్)**

తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే కేవలం టిఆర్ఎస్ తోనే సాధ్యమని మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ బట్టి అజయ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి తెలంగాణ సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్ లో జరిగే సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బీసీ మైనారిటీ వర్గాలకు సామాజిక న్యాయం జరగలేదని సమాన అవకాశాలు రాలేదని తెలిపారు. సామాజిక న్యాయంజరగాలంటే టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ద్వారా మాత్రమే సిద్ధిస్తుందని అన్నారు.భారత రాష్ట్ర సమితి గాని, కాంగ్రెస్ ప్రభుత్వం గాని సామాజిక న్యాయం చేయడంలో విఫలం అయ్యారన్నారు.తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' నిర్వహిస్తున్నామని ఈ మహాసభ ప్రజల ఆకాంక్షలకు కొత్త దిశను చూపించే చారిత్రాత్మక సభగా నిలవనుందన్నారు. ఆగస్టు 6 హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ మహాసభ కు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు టిఆర్ఎస్ అభిమానులు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలాన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఇప్పా రమేష్,కాసాపురం అశోక్, టౌన్ ఇన్‌చార్జ్ కేవల్ నందకుమార్, టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జునైద్,వీరస్వామి,దగ్గడ్ శ్రీకాంత్,ఎల్లం, నవీన్, భాను, ప్రేమ్, సయ్యద్ ఇమ్రోజ్, సోహైల్, రేహాన్, అర్సలాన్, మధు, తదితరులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్లాపూర్ రోడ్లకు ఇక మోక్షం..





- **అల్లాపూర్ రోడ్ల దుస్థితిపై బండి రమేష్ ఫైర్..**
- **నిలిచిన పనులకు అధికారులకు ఆదేశాలు..**
- **ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 ( సిరి న్యూస్ ):**

కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లో రోడ్ల దుస్థితిపై కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సఫ్దర్ నగర్‌లో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పాదయాత్ర సందర్భంగా గుర్తించిన సమస్యలు ఇప్పటికీ అలాగే కొనసాగుతుండటంపై బండి రమేష్ స్పందించారు. ముఖ్యంగా ఈ–బ్లాక్ రోడ్డు నిర్మాణ పనులు జీహెచ్ఎంసీ, జలమండలి శాఖల సమన్వయ లోపంతో నిలిచిపోవడంపై మండిపడ్డారు. ఇప్పటికే నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో వర్షాకాలంలో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కూకట్‌పల్లి జోన్ జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మంజీరా పైప్‌లైన్ పనుల పేరుతో రోడ్డు నిర్మాణాన్ని ఆలస్యం చేయొద్దని, జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని పేర్కొన్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమస్యలను నమోదు చేసుకున్న బండి రమేష్, దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అల్లాపూర్ వాజీద్ పాషా, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, సాయి తులసి, రేష్మ, లక్ష్మి, రాము, రాంబాబు, శంకర్, నరసింహ, నరసింహ యాదవ్, వేణు, సతీష్, కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు..

# దిల్‌కుష్‌నగర్ సమస్యలపై ఎమ్మెల్యే ఫోకస్..



- **కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కృష్ణారావు..**
- **రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై హామీ..**
- **ప్రజల సమస్యల పరిష్కారానికి భరోసా..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4 ( సిరి న్యూస్**

బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్ కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారంపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టి సారించారు. కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దిల్‌కుష్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ సూచిక బోర్డుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరై బోర్డులను ప్రారంభించారు. అనంతరం వారు కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తూ ప్రతి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు రహదారుల అధ్వాన పరిస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, ఇతర మౌలిక వసతుల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రజల సహకారం, సంక్షేమ సంఘాల చొరవ ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దిల్‌కుష్‌నగర్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సంక్షేమ సంఘం చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా దిల్‌కుష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ హుస్సేన్, సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, సంఘ సభ్యులు మొహమ్మద్ జమీల్, మొహమ్మద్ కరీముల్లా, మొహమ్మద్ ఫారూఖ్, ఆంజనేయులు గౌడ్, మొహమ్మద్ తౌఫిఖ్, మొహమ్మద్ అజీమ్, ముఖ్తార్, రాజ్ కుమార్, మొహమ్మద్ ఫయాజ్, అజమాత్, హది, మొహమ్మద్ జాబేర్, భాస్కర్ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..



# మాదకద్రవ్యాల మత్తుతో జీవితం చిత్తు

- **మన సమాజం నుండి మాదకద్రవ్యాలను, గంజాయిని తరిమేయాలి**
- **సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్.**
- **క్రమశిక్షణతో కూడిన అలవాట్లు మంచి భవిష్యత్తును, విజయాన్ని అందిస్తాయి అని విద్యార్థులకు తెలిపిన ఎస్పి.**
- **తప్పులు చేసే వారిని సంస్కరించడానికే చట్టాలు.**
- **మాదకద్రవ్యాల మత్తుతో జీవితం చిత్తు అవుతుంది.**
- **యువత మంచిని, చెడులను గ్రహించి చెడుకు దూరంగా ఉండాలి.**
- **విద్యార్థులు ఆత్మవిశ్వాసం తో కష్టపడి చదువుకోవాలి.**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ఆగస్టు 04, (సిరి న్యూస్ )**

సూర్యాపేట పట్టణం లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పోలీసు, సూర్యాపేట బ్రహ్మకుమారిస్ వారి సంయుక్త అధ్వర్యంలో పట్టణంలో 60 ఫీట్ల రోడ్డు లో గల జయ పాటశాల నందు మాదకద్రవ్యాల నిర్మూల, విద్యార్థుల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ హాజరై విద్యార్థులను, మంచి విజయాలను గురించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రధాన మంత్రి నషా ముక్త్ భారత్ అభియాన్ అనే నినాదంతో మాదకద్రవ్యాల, గంజాయి ని సమాజం నుండి వెలివేయడానికి కృత నిశ్చయంతో ఉన్నది అన్నారు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని వాటి సాధనకు నిరంతర కృషి, సాధన చేయాలని అన్నారు. క్రమశిక్షణ తో కూడిన అలవాట్లకు మంచి విజయాలను అందిస్తాయి అన్నారు. పేదరికం నుండి కష్టపడి చదివి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతి గా దేశానికి సేవలు అందించిన అబ్దుల్ కాలం గారి జీవిత విజయం గురించి వివరించారు. దేశ భవిష్యత్తు కోసం అవకాశాలు లేని రోజుల్లో మహానుభావులు ఎంతో కృషి చేశారు, బంగారు భవిష్యత్తు కళ్ళ ముందు ఉన్నది టెక్నాలజీ, ఉన్నత విద్య, రవాణా లాంటి సౌకర్యాలు ఉన్నాయి మంచి మార్గాన్ని ఎంచుకుని ఎదగాలి అన్నారు. మంచి చెడులు గ్రహించి మంచి మార్గంలో నడవాలి అన్నారు, సోషల్ మీడియా కు బానిసలు కావద్దు, టెక్నాలజీనీ విద్య కోసం ఉపయోగించాలి అన్నారు. డ్రగ్స్ అనేవి యువతను నిర్వీర్యం చేస్తుంది అన్నారు. డ్రగ్స్ వల్ల బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు అన్నారు. వీటికి దూరంగా ఉండాలి అన్నారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు, మానవ సంబంధాలను హేళన చేస్తున్నారు అన్నారు. పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలని తలిదండ్రులు కోరుకుంటారు. బాలికలు ఆత్మ అవిశ్వాసంతో ఉండాలి అన్నారు. బాలికలను ఎవరైనా ఇబ్బంది పెడితే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి, పిర్యాదు చేయాలని అన్నారు. మహిళల, బాలల భద్రత, రక్షణలో ప్రదన్యంతో పని చేస్తున్నాము, బాధిత మహిళలకు, బాలలకు సొంత అక్కలాగా సేవలు అందించడానికి పోలీసు అక్క కార్యక్రమం ఏర్పాటు చేశాం అన్నారు. సమాజంలో ప్రస్తుతం సైబర్ మోసాలు అనేవి తీవ్ర స్థాయిలో ఉన్నాయి, అపరిచితులు ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు అన్నారు. అప్రమత్తంగా ఉండాలి అని కోరారు. మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు, ఇతరులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు. పిల్లలు వాహనాలు నడపవద్దు, పాఠశాలకు, కళాశాలకు వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి అన్నారు. డ్రగ్స్ గంజాయి నిర్మూలనపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పాటలతో జిల్లా పోలీస్ కళాబృందం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పట్ల, క్రమశిక్షణ, విజయాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బ్రహ్మకుమారిస్ సంస్థ నుండి హిమబిందు, పాటశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ లు యాదవేందర్, కనకరత్నం, షీ టీం ఎస్ఐ నీలిమ, విద్యార్థులు, బ్రహ్మకుమారిష్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.





The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.


www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
బుధవారం
ఆగస్టు-05-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 206
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

## బాలికను చేరదీశారు
# బానిసగా మార్చారు

- ప్రేమను పంచకుండా కష్టాలను చూపెట్టారు
- సిడబ్ల్యూసికి ఫిర్యాదు చేసిన స్థానికులు
- కుటుంబీకులపై కేసు నమోదు
- తూప్రాన్ ఎస్ఐ గంగరాజు

2









### హీటెక్కిన కోనాపూర్ రాజకీయం

# ఢీ అంటే ఢీ!

## నువ్వా నేనా..? అంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

- సవాళ్లు, ప్రతిసవాళ్లతో మెదక్ నియోజకవర్గంలో రాజకీయం వేడి
- తాడోపేడో తేల్చుకుంటామంటూ బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక
- ఆదివారం కాంగ్రెస్ ప్రెస్ మీట్.. మరుసటి రోజే గులాబీ నేతల కౌంటర్

**ఎదురుదాడి చేయండి.. బీఆర్ఎస్ కార్యకర్తలకు అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్**

- దేవేందర్ రెడ్డి అవినీతి నిరూపించాలని కాంగ్రెస్ పట్టుదల
- ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేలా పక్కా ప్లాన్
- ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ రణరంగం
- కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపేలా బీఆర్ఎస్ పద్మవ్యూహం

మెదక్ నియోజకవర్గ పరిధిలోని కోనాపూర్ రాజకీయం ఒక్కసారిగా తీవ్ర స్థాయికి చేరింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం పీక్స్‌కు చేరింది. ఇరు పార్టీల నేతలు సై అంటే సై అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటున్నారు. కోనాపూర్ సొసైటీ వేదికగా మొట్ట మొదటిసారిగా కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నేతలు అత్యంత ఘాటైన రీతిలో స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడంతో మెదక్ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

- (ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)

3

## వాటర్ ప్లాంట్ వ్యర్థ కాలుష్యంతో
# బామన్ చెరువు ధ్వంసం

- చేపల మరణం అధికారుల నిర్లక్ష్యం
- ఫిర్యాదులు చేసిన కథలని ఇరిగేషన్ యంత్రాంగం
- కన్నీరుమున్నీరవుతున్న మత్స్యకారులు

జిన్నారం ఆగస్టు 04 సిరి న్యూస్ : జిన్నారం మండల పరిధిలోని భామన చెరువు బఫర్ జోన్లో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడంతో, వాటర్ ప్లాంట్ నుంచి విచ్చలవిడిగా వ్యర్ధ కాలుష్య  జలాలను చెరువులోకి వదులుతున్నారని ఊట్ల గ్రామస్తులు మంగళవారం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బుషి గారి కృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.



2

# వాటర్ ప్లాంట్ వ్యర్థ కాలుష్యంతో బామన్ చెరువు ధ్వంసం

### చేపల మరణం అధికారుల నిర్లక్ష్యం
### ఫిర్యాదులు చేసిన కథలని ఇరిగేషన్ యంత్రాంగం
### కన్నీరుమున్నీరవుతున్న మత్స్యకారులు



జిన్నారం ఆగస్టు 04 సిరి న్యూస్ : జిన్నారం మండల పరిధిలోని భామన చెరువు బఫర్ జోన్లో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడంతో, వాటర్ ప్లాంట్ నుంచి విచ్చలవిడిగా వ్యర్థ కాలుష్య జలాలను చెరువులోకి వదులుతున్నారని ఊట్ల గ్రామస్తులు మంగళవారం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బుషి గారి కృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బామన్ చెరువు ఎగువ భాగంలోని బఫర్ జోన్ లో ఉన్న వాటర్ ప్లాంట్ నుండి రసాయన వ్యర్థాలు కలుషిత నీరు చెరువులోకి కలవడం వల్ల నీరు తీవ్రంగా విషతుల్యం అవుతుంది అని తెలిపారు. భామన చెరువు కాలుష్యం బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు మరియు చేపల మరణాలపై ఓట్ల మత్స్యకారులు నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదు అంటూ ఆయన తెలిపారు. జలచారాల మరణ హోమం నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి కాలుష్యం పెరగడంతో పెద్ద సంఖ్యలో చేపలు చనిపోయి తేలుతున్నాయి అని అన్నారు. బఫర్ జోన్ ఉల్లంఘన ఎఫ్టిఎల్ ఫుల్ ట్యాంక్ లెవెల్ మరియు బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వ నిబంధనలను త్రోసిరాజంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ పట్టించుకోని బఫర్ జోన్లో నిర్మించిన వాటర్ ప్లాంట్ పై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మల్లేష్, పూజారి శ్రీనివాస్, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికను చేరదీశారు బానిసగా మార్చారు

- ప్రేమను పంచకుండా కష్టాలను చూపెట్టారు
- సిడబ్ల్యూసికి ఫిర్యాదు చేసిన స్థానికులు
- కుటుంబీకులపై కేసు నమోదు
- తూప్రాన్ ఎస్ఐ గంగరాజు

తూప్రాన్, ఆగస్టు 4 (సిరి న్యూస్) : కన్నవాళ్ళు అకాల మరణం చెందడంతో అనాధగా మారింది ఆ బాలిక.. బంధువులు బాలికను చేరదీస్తే సంతోషించిన మైనర్ బాలికకు వేధింపుల రూపంలో నరకయాతన పెట్టారు... చివరికి బానిసగా మార్చి కన్నీళ్లు పెట్టించారు.. స్థానికుల ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన ఇది.. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..తూప్రాన్ పట్టణంలోని ఒక కాలనీకి చెందిన 12 సంవత్సరాల బాలిక తల్లిదండ్రులు మరణించడంతో, ఆమెను బంధువులు తమ వద్ద ఉంచుకున్నారు. అయితే, బాలికతో ఇంటి పనులు బలవంతంగా చేయించడం, కొట్టడం, క్రూరంగా ప్రవర్తించడం జరిగినట్లు సమాచారం అందడం జరిగింది.ఈ ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) అధికారి శంకర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందనీ ఎస్సై గంగరాజు తెలిపారు. చిన్నారులపై మానసిక వేధింపులు, బాల కార్మికత్వం, లేదా ఏ విధమైన దుర్వినియోగం జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100/112కు సమాచారం అందించాలని అన్నారు. పిల్లల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత, చిన్నారుల వ్యక్తిగత వివరాలు లేదా గుర్తింపు తెలిపే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని ఒకవేళ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కనుక ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు.



# దివ్యాంగులకు ప్రత్యేక వైకల్య శిబిరాలు

### డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య

సిద్దిపేట, ఆగస్టు 4 (సిరి న్యూస్): జిల్లాలో దివ్యాంగులకు యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డుల జారీ కోసం ఆగస్టు నెలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్య తెలిపారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైకల్యం వారీగా శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మానసిక అనారోగ్యం, మేధో వైకల్యానికి సంబంధించి ఆగస్టు 6న, తక్కువ చూపు, అంధత్వానికి ఆగస్టు 6, 20 తేదీల్లో, వినికిడి లోపానికి ఆగస్టు 20న, లోకోమోటర్ వైకల్యానికి ఆగస్టు 13, 27 తేదీల్లో శిబిరాలు నిర్వహిస్తారు. శిబిరానికి హాజరయ్యే వారు ముందుగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు సంఖ్య లేదా ఫోన్‌కు వచ్చిన సందేశంతో రావాలని అధికారులు సూచించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, పాత వైకల్య ధ్రువీకరణ పత్రం ఉంటే, సంబంధిత వైద్య నివేదికలు, ఎక్స్‌రేలు తదితర పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్య తెలిపారు.

# హీలియం గ్యాస్ పీల్చుకొని యువకుడి బలవన్మరణం

సిద్దిపేట, ఆగస్టు 4 (సిరి న్యూస్) : సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్లే హైవే రోడ్డులో నాగులబండ వద్ద ఉన్న హరిత మినర్వా హోటల్ లో గూడూరు సంతోష్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణానికి చెందిన సంతోష్ కుమార్ అనే చార్టెడ్ అకౌంటెంట్ ఈ నెల 1న మధ్యాహ్నం హరిత హోటల్ లో గది అద్దెకు తీసుకున్నాడు. జూదానికి అలవాటు పడిన సంతోష్ గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్టు సూసైడ్ నోట్ లో పేర్కొన్నాడు. వెంట తెచ్చుకున్న హీలియం గ్యాస్ పీల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.




## హీటెక్కిన కోనాపూర్ రాజకీయం

# ఢీ అంటే ఢీ!

**నువ్వా నేనా..? అంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్**

*సవాళ్లు, ప్రతిసవాళ్లతో మెదక్ నియోజకవరంలో రాజకీయం వేడి*

*తాడోపేడో తేల్చుకుంటామంటూ బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక*

*ఆదివారం కాంగ్రెస్ ప్రెస్ మీట్.. మరుసటి రోజే గులాబీ నేతల కౌంటర్*

మెదక్ నియోజకవర్గ పరిధిలోని కోనాపూర్ రాజకీయం ఒక్కసారిగా తీవ్ర స్థాయికి చేరింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం పీక్స్‌కు చేరింది. ఇరు పార్టీల నేతలు సై అంటే సై అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటున్నారు. కోనాపూర్ సొసైటీ వేదికగా మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నేతలు అత్యంత ఘాటైన రీతిలో స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడంతో మెదక్ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. - (ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)

## ఎదురుదాడి చేయండి.. బీఆర్ఎస్ కార్యకర్తలకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్

**కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపేలా బీఆర్ఎస్ పద్మవ్యూహం**

**దేవేందర్ రెడ్డి అవినీతి నిరూపించాలని కాంగ్రెస్ పట్టుదల**

**ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేలా పక్కాప్లాన్**

**ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ రణరంగం**

### బీఆర్ఎస్‌ను దెబ్బతీసేలా కాంగ్రెస్ పక్కా ప్లాన్..

మరోవైపు కోనాపూర్ సొసైటీ వ్యవహారంలో దేవేందర్ రెడ్డి అవినీతిని ఎలాగైనా నిరూపించి తీరాలని కాంగ్రెస్ నేతలు కూడా పక్కా ప్లాన్ తో ముందుకెళ్తున్నారు. బీఆర్ఎస్ నేతలు మళ్లీ పుంజుకునేందుకు ఎలాంటి అవకాశాన్ని ఇవ్వకూడదని భావిస్తూ కాంగ్రెస్ నాయకత్వం రాజకీయ చక్రం తిప్పుతోంది. అందులో భాగంగా గెలిచిన కౌన్సిలర్లతో పాటు, బీఆర్ఎస్‌లో యాక్టివ్‌గా ఉన్న కీలక పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా తమ పార్టీలో కలుపుకుంటూ ప్రతిపక్ష పార్టీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ప్లాన్ రచిస్తోంది. రెండు పార్టీల నేతలు రింగ్‌లో బాక్సింగ్ చేస్తున్నట్లుగా పరస్పరం మాటల దాడులు చేసుకోవడంతో కోనాపూర్ రాజకీయాలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

### రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్న కోనాపూర్ వార్...

మొత్తానికి కోనాపూర్ వేదికగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోరు ముదిరి పాకాన పడింది. రెండు పార్టీల నేతలు రింగ్‌లో బాక్సింగ్ చేస్తున్నట్లుగా నేరుగా పరస్పరం పదునైన విమర్శలతో దాడులు చేసుకుంటున్నారు. ఒకవైపు కాంగ్రెస్ నేతలు దేవేందర్ రెడ్డి అవినీతిపై విచారణల పేరుతో బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టాలని చూస్తుంటే, మరోవైపు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ తిరగబడుతున్నారు. రెండు వైపుల నుంచి ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్న ఈ కోనాపూర్ పొలిటికల్ వార్ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

### ప్రెస్ మీట్లలో కౌంటర్ అటాక్‌లు..

తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులు, ఇకపై కాంగ్రెస్ విమర్శలను భరించేది లేదని స్పష్టం చేశారు. తాము చేయని తప్పులకు సంవత్సరాలుగా పదేపదే ఎన్నికల్లో కోనాపూర్ సొసైటీలో అవినీతి జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ నేతలు పబ్బం గడుపుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నాటి సమావేశంలో దేవేందర్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయగా, దానికి మరుసటి రోజే బీఆర్ఎస్ నేతలు మీడియా వేదికగా తిప్పికొడుతూ కౌంటర్ అటాక్ ఇచ్చారు.

### కార్యకరల్లో ఆత్మవిశ్వాసం నింపేలా అధిష్టానం దిశా నిర్దేశం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిందని, ఇకపై ఏమాత్రం ఆగవద్దని క్షేత్రస్థాయిలో కౌంటర్ అటాక్ చేయాల్సిందేనని బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే ఎన్నికలు దగ్గర పడుతుండటంతో, కేడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా బీఆర్ఎస్ అధిష్టానం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. ప్రత్యర్థుల విమర్శలను వెంటనే తిప్పికొట్టడం ద్వారా గ్రౌండ్ లెవెల్‌లో పార్టీ బలాన్ని చాటుకోవాలని నాయకులకు ఆదేశాలు ఇచ్చింది.